క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ నర్తు



జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ నర్తు రామారావు మంగళవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సమస్యలు, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మాట్లాడినట్లు రామారావు తెలిపారు. గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తల సమస్యలు, ప్రజా సమస్యలపై పార్టీ తరఫున అధికార పార్టీని నిలదీయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో రేవు అమ్మవారి సంబరాలు

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడులో గంగాధర సేవా సంఘం ఆధ్వర్యంలో ఏటా మత్స్యకారులు ఆనవాయితీగా జరుపుకునే రేవు అమ్మవారి సంబరాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ఊరేగిస్తూ సముద్ర తీరంలో శాంతి హోమం పూజలు జరిపారు. పల్లెటి కుటుంబం నుంచి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

బిర్లంగి విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బిర్లంగి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రెండు రోజుల నుంచి అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న అండర్–14 బాలికల విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి బాకి కవిత శ్రీకాకుళం జిల్లా జట్టు తరఫున ఆడి ప్రథమ స్థానం కైవసం చేసుకొని విజేతగా నిలిచింది. అండర్–19 బాలుర విభాగంలో పదో తరగతి విద్యార్థి బర్ల కార్తీక్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. తొమ్మిదో తరగతి విద్యార్థి పరపటి ధర్మరాజు అసమాన ప్రతిభను చూపించాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను, పీడీ బి.ధర్మరాజును ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరమణ, ఉపాధ్యాయులు, స్థానిక నాయకుడు మేరుగు సూర్యనారాయణ, బాకి లక్ష్మీనారాయణ అభినందించారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థిని ప్రతిభ



సోంపేట: రాష్ట్రస్థాయిలో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఎడ్యుకేషన్ వింగ్ ఆధ్వర్యంలో 'క్షమించు–మరిచి పో'అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని సోనాలి సాహు ప్రతిభ కనబర్చింది. రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచినట్టు సోంపేట సత్యసాయి ప్రతినిధులు మంగళవారం తెలిపారు.

స్తంభాన్ని ఢీకొట్టిన ఆటో

టెక్కలి: రావివలస గ్రామంలో మంగళవారం ఓ ఆటో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కొంతమంది భక్తులు ఆటోలో మల్లన్న దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆటో మాత్రమే స్వల్పంగా దెబ్బ తినగా ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు.

పక్కాగా పశుగణన

కంచిలి: అఖిల భారత 21వ పశుగణనను సంపూర్ణంగా చేపట్టాలని టెక్కలి పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ వి.జయరాజ్ పేర్కొన్నారు. జాడుపూడి, దాకరాపల్లి గ్రామాల్లో జరుగుతున్న పశుగణనను మంగళవారం పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలోని 15 గ్రామాల్లో రెండు వేల ఇళ్లలో పశుగణన పూర్తయింన్నారు. మండల పశువైద్యాధికారిణి డాక్టర్ టి.శిరీష, ఎన్యుమరేటర్లు రాజేష్, రబియా పాల్గొన్నారు.

విద్యార్థినికి అండగా..

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దున్న సమీరా పక్షవాతంతో కటక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె చికిత్స కోసం పలువురు అండగా నిలుస్తున్నారు. 2018 తెలుగు పండిత సేవా సదన్ రూ. 5 వేలు, ఉపాధ్యాయులు రూ.5 వేలు, తోటి విద్యార్థులు రూ.5 వేలు సేకరించి మంగళవారం సమీరా కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు జె.సరోజ, నాయకుడు బుద్ధ కల్యాణ్ పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా లక్ష్మణ్

కాశీబుగ్గ: పలాస మండలం గురుదాసుపురం పంచాయతీ సర్పంచ్ కుత్తుమ లక్ష్మణ్ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది.

కొబ్బరికి కార్తీక గిరాకీ..!

- రైతులకు అనుకూలించిన సీజన్



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న కొబ్బరి కాయలు

వజ్రపుకొత్తూరు: ఉద్దానం అంటే కొబ్బరికి ప్రసిద్ధి. ఒక చెట్టు ఉంటే చాలు పెద్ద కొడుకులా చూసుకుంటారు. అంతటి ఖ్యాతిగాంచిన కొబ్బరి రైతులు ఇటీవల ధరల్లో తీవ్ర వ్యత్యాసం, ఒడిదుడుకులను చవిచూశారు. అయితే ఏడాదంతా ఆదాయాన్ని తెచ్చే కొబ్బరికి కార్తీక మాసం వస్తే చాలు రైతులకు ఉపశమనం ఇస్తుంది. ఎందుకంటే ధర పెరిగి అవసరాలు తీరుతాయి. పలాస నియోజకవర్గంలో మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో కొబ్బరి అధికంగా పండుతోంది. మార్కెట్లో ధరలు అనుకూలించడంతో రైతులు నష్టాల బారి నుంచి బయట పడ్డారు. వంద కొబ్బరి కాయలను రూ.1500 నుంచి 18 వందల రూపాయల వరకు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ.2,500 వరకు ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు.

వర్షాలు అనుకూలించడంతో..

ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో పంట దిగుబడి పెరిగింది. ఇన్నాళ్లు పిక్క కాయలు ఎక్కువగా దిగుబడివస్తే ఈ ఏడాది కాయ సైజు పెరిగి పిక్క(చిన్నవి) కాయల సంఖ్య తగ్గింది. దీంతో రైతులకు లాభం చేకూరింది. పెద్దకాయకి.. పిక్క కాయకి తేడా ఏంటంటే ఒక పెద్ద కాయ బదులు రెండు పిక్క కాయలను వ్యాపారులు లెక్కడతారు. ఎకరాకు ఏడాదికి దుక్కులు, ఎరువులు, నీరు పెట్టడం, కాయలు తీతకు కూలీల ఖర్చు వంటి పనులకు దాదాపు రూ.40 వేలు పెట్టుబడి పెడుతున్నారు. ఏడాదిలో ఐదుసార్లు కాయలు తీసి విక్రయిస్తారు. వర్షాలు అనుకూలిస్తే ఎకరాకు ఒకసారి వెయ్యి కాయలు దిగుబడి వస్తుంది. ఈ లెక్కన ఏడాదికి ఐదువేల కాయలు అందుబాటులోకి వస్తాయి. సగటును కాయ రూ.18 లెక్క ఐదువేల కాయలకు రూ.90 వేలు ఈ సీజన్‌లో రైతుల చేతికి అందుతుంది.

ముమ్మరంగా ఎగుమతులు

ఇదిలా ఉండగా కార్తీక మాసం కావడంతో ఉద్దానం కొబ్బరి కోల్‌కత్తా, ఒడిశాలకు పెద్ద మొత్తంలో ఎగుమతులు చేస్తున్నారు. నేరుగా రైతుల వద్ద నుంచి లోడింగ్ చేసి తరలిస్తున్నారు. పలాస నియోజకవర్గంలో గత 15 రోజులుగా దాదాపు 1.50 కోట్ల కొబ్బరి కాయలను ఎగుమతి చేశారు. ఈ నెలాఖరు నాటికి మరో మూడు కోట్ల కాయలను రైతుల వద్ద నుంచి సేకరించే పనిలో నిమగ్నమైయ్యారు. దీంతో కార్తీక మాసంలో దాదాపు రూ.45 కోట్లు వ్యాపారం జరుగుతోంది. హరిపురం, పలాస, పూండి మర్కెట్‌ల నుంచి ప్రధానంగా కొబ్బరి కాయలు తరలిస్తున్నారు.

ధర బాగుంది



కార్తీక మాసం కాబట్టి ధర బాగుంది. వంద కాయలను రూ.1500 నుంచి 18 వందల రూపాయల వరకు విక్రయిస్తున్నాం. ఈ ఏడాది వర్షాల అనుకూలించడం వల్ల పిక్క కాయలు సంఖ్య తగ్గడంతో లాభం చేకూరింది. రైతులకు పెట్టుబడి ఖర్చు ఏడాదికి దాదాపు రూ.40 వేలు అయిపోతుంది. ధరలు మాత్రం స్థిరంగా ఉండడం లేదు. బహిరంగ మార్కెట్‌లా ధరలు స్థిరీకరణ చేసి రైతులకు మేలు చేయాలి.

– కె. నారాయణరావు, కొబ్బరి రైతు, పూడిజగన్నాథపురం

పెట్టుబడి అధికమే..



నాకు నాలుగు ఎకరాలు భూమి ఉంది. ఏడాదికి ఐదుసార్లు కాయలు తీస్తాను. ఎకరాకు గరిష్టంగా ఐదు వేల కాయలు దిగుబడి వస్తుంది. వర్షాలు అనుకూలించకుంటే నాలుగు వేల కాయలకు దిగుబడి పడిపోతుంది. ఏది ఏమైనా ఈ ఏడాది మాత్రం ప్రస్తుతం వంద కాయలు రూ.1800 వరకు అమ్ముడు పోతున్నాయి. సంతోషంగా ఉంది. పెట్టుబడి కూడా అధికంగానే ఉంటుంది. రైతులకు పురుగు మందులు, యాజమాన్య పద్ధతులపై సలహాలు సూచనలు ఇవ్వాలి. ఉచితంగా పురుగు మందులు అందించాలి.

– టి. వెంకటేష్, కొబ్బరి రైతు, తిమ్మలవానిపేట

చదువుకు సాయం..



వజ్రపుకొత్తూరు మండలం పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురం గ్రామానికి చెందిన తమ్మినాన సుస్మిత కంచిలి మోడల స్కూల్‌లో ఇంటర్ చదువుతోంది. ఆమె తండ్రి రాజారావు మృతి చెందారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మృతుని కుటుంబానికి అండగా నిలిచేందుకు శ్రీ కాళీమాత వాట్సాప్ గ్రూప్ వేదికగా రూ. 23 వేలు సేకరించారు. సుస్మిత ఉన్నత చదువుకు ఈ డబ్బును ఖర్చు చేయాలని సూచిస్తూ సంబంధిత మొత్తాన్ని బాండ్ రూపేణా మంగళవారం అందించారు. గ్రామ కమిటీ సభ్యులు హనుమంతు శివకుమార్, హెచ్.అప్పలస్వామి, కె.చలపతిరావు, రేవతి ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

మత్స్యకార సహకార సంఘాలతో అభివృద్ధి



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న సంఘ సభ్యులు

కవిటి: సంప్రదాయ మత్స్యకారులకు మత్స్యశాఖ సూచించిన నిబంధనల ప్రాప్తికి సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సమ్మిళిత అభివృద్ధి సాధ్యపడుతుందని ఇచ్ఛాపురం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రవికుమార్ అన్నారు. చిన్నకర్రివానిపాలెంలో తీరప్రాంత గ్రామాల మత్స్యకార సహకారసంఘం ఎన్నికను పలాస ఎఫ్‌డీఓ ధర్మరాజు పాత్రో ఎన్నికల అధికారిగా వ్యవహరించి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన తొమిమది మంది పాలకవర్గ సభ్యులకు గణేష్ తీరగ్రామ మత్స్యకార సహకార సంఘాన్ని గుర్తిస్తూ నియామక ఉత్వర్వులు అందించారు. పాలకవర్గం 2029 నవంబర్ 11వ తేదీ వరకు పని చేస్తోందన్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.చంద్రశేఖర్, ఎం.పురుషోత్తం, ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కంచిలి: మండలం నుంచి జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నలుగురు ఉపాధ్యాయులను మండల యూటీఎఫ్ శాఖ ఘనంగా సత్కరించింది. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్కారం పొందిన వారిలో బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా, కంచిలి ప్రాథమిక పాఠశాల సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయుడు జర్జాన భగవతి రావు, సువాగడ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాఢి, అదే పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు చంద్రమణి గొమాంగోలు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

మండల యూటీఎఫ్ శాఖ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. మండల శాఖ నూతన అధ్యక్షునిగా మురళీనాయక్, గౌరవ అధ్యక్షునిగా త్రిలోచన ప్రధాన్, ప్రధాన కార్యదర్శిగా నల్లాన రవి, సహాధ్యక్షులుగా జాకబ్ లిమ్మా, మహిళా సహాధ్యక్షురాలిగా కె.అనురాధ, కోశాధికారిగా టి.త్రినాథ్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జె.భగవతిరావు, సీపీఎస్ కన్వీనర్ బుల్లు బెహర, జిల్లా కౌన్సిలర్లుగా హేమసుందరరావు, లక్ష్మణరావు, ఎ.సరిత, లక్ష్మి, మినిసి, నిరంజన్ బెహరాను ఎన్నుకున్నారు.

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త తిలక్



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న పేరాడ తిలక్

సంతబొమ్మాళి: క్షేత్ర స్థాయిలో కార్యకర్తలను, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులను చైతన్యం చేసి.. ముందుకు తీసుకెళ్లి సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. దండుగోపాలపురంలో పార్టీ నాయకులతో మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటుపై మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నిలబడే వారే జగనన్న అభిమానులన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మీ అందరినీ గౌరవించే బాధ్యత తనదన్నారు. సోషల్ మీడియా, పార్టీ కార్యకర్తలపై జరిగిన దాడులను అందరం సమిష్టిగా ఎదుర్కొని ముందుకు సాగుదామని చెప్పారు. నష్టపోయే ఉద్యోగులకు తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదుకునే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఇళ్లు తొలగించిన, బిల్లులు చెల్లించకపోయినా కోర్టుకు వెళ్లి బాధితుల తరఫున న్యాయపోరాటం చేస్తామన్నారు. అర్హులకు పింఛన్లు ఇవ్వకపోయినా, ఉన్నవి తొలగించిన తమను సంప్రదించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు బి.మోహన్‌రెడ్డి, నక్క భీమారావు, మార్పు నాగభూషణరావు, భూషణరెడ్డి, టి.నారాయణ, అంగ జనార్దన్, నక్కెట్ల నరేష్, అంగ అప్పారావు, పంగ రామయ్య, మార్పు అశోక్ చక్రవర్తి, అంగం మల్లేష్, పంగ అప్పన్న ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న మండల అధికారులు



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కవిటి: గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సమాయత్తం కావాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామైక్యసంఘాలు, అన్నిశాఖల మండల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన వివరాలను మాస్టర్ ట్రైనీలు వివరించారు. ఏపీఎం కె.గోవింద, ఏపీవో తలగాన మోహనరావు ఉన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

కోటబొమ్మాళి: రాబోవు రోజుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెలుగు సీఎఫ్‌లకు శిక్షణను ఇచ్చారు. ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ శిక్షణ ఉద్దేశాన్ని వివరించారు. ఈవోపీఆర్డీ ఆనందరావు, డీటీ ప్రసాదరావు, డ్వామా ఏపీవో పి.హరిప్రసాద్, మాస్టర్‌ట్రైనర్ బాలకృష్ణ పాల్గొన్నారు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఎస్.కృష్ణ అన్నారు. ఎంపీడీలో సమావేశ మందిరంలో 'గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రాణాళిక 2025–26' పై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పారిశుధ్యం, తాగునీరు, ఆదాయ వనరులు, ఐసీడీఎస్ బాల సభ, మహిళా సభలపై చర్చించారు. ఐసీడీఎస్ సీడీపీవో పి.నాగరాణి పాల్గొన్నారు.

పలాస: గ్రామాల అభివృద్ధికి తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని పలాస ఎంపీడీవో వసంతకుమార్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయ సంఘాల వీవోలు, సీఎఫ్‌లకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు లండ శ్రీధర్, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠ రావు పాల్గొన్నారు.

టెక్కలి: సమగ్రమైన ప్రణాళికతోనే పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చునని టెక్కలి ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు.

కంచిలి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికార యంత్రాంగం అంతా ఐక్యంగా కృషి చేయాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్లాక్ పంచాయతీ డెవెలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ), గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ జరిగింది. ఎంపీడీవో వి.తిరుమలరావు, ఈవోపీఆర్డీ కె.ఈశ్వరి, ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు, ఎంఈవో–2 కె.చిట్టిబాబు, మండల పశువైద్యాధికారిణి టి.శిరీష పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

టెక్కలి: టెక్కలి శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి బి.రూపావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వరకు వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం 133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏఈ గోవిందరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కార్యాలయం ఆవరణలో ఏపీఈపీడీసీఎల్, సీజీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే పరిష్కారవేదికలో సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ బి.సత్యన్నారాయణ, టెక్నిషియన్ ఏఎం మణి, డాక్టర్ సురేంద్రకుమార్ పాల్గొంటారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన


కవిటి: బాలబాలికలు, మహిళల రక్షణపై మిషన్ వాత్సల్య పథకం ద్వారా చేపడుతున్న రక్షణచర్యలపై విస్తృత అవగాహన కలిగిఉండాలని జిల్లా బాలల రక్షణ విభాగం పథకం సోషల్‌వర్కర్ డి.మధుర మీనాక్షి అన్నారు. కవిటి మండల మహిళా సమాఖ్యలో గ్రామైక్యసంఘాల సిబ్బందితో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. పిల్లల్లేని దంపతులు పిల్లల్ని దత్తత తీసుకునేటప్పుడు అనుసరించవలసిన విధానాలు, అనధికార దత్తత వల్ల జరిగిన నష్టాలు స్పష్టంగా ప్రజలకు తెలపాలన్నారు.

జాబ్ మేళాలో 12 మంది ఎంపిక

సోంపేట: జాబ్‌మేళాలో వచ్చిన అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బారువ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించారు. 43 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా వారిలో 12 మంది ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ, జేకేసీ కోఆర్డినేటర్ బడ్డ రాంబాబు, స్కిల్ హాబ్ కోఆర్డినేటర్ తేజేశ్వ రావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఎస్పీని కలిసిన కాశీబుగ్గ డీఎస్పీ



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న వెంకటఅప్పారావు

కాశీబుగ్గ: కాశీబుగ్గ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి.వెంకటఅప్పారావు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేశారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల విజేత రట్టి

నందిగాం: క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుమల చైతన్య అన్నారు. బడగాం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలను డీఈఓ ప్రారంభించారు. మొత్తం 33 జట్లు పాల్గొనగా మందస మండలం రట్టి ప్రాథమికోన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచి రూ.5వేలు నగదు, ట్రోఫీ అందుకుంది. సంతబొమ్మాళి, కణితూరు ఉన్నత పాఠశాలలు తర్వాత స్థానాల్లో నిలిచి నగదు, బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు బహుమతులను పలాస వైద్యుడు డాక్టర్ కూన పవన్‌కుమార్ సమకూర్చారు. ఎంఈఓ జి.నర్సింహులు, సర్పంచ్ కూన శాంతారావు పాల్గొన్నారు.

ఊరటనివ్వని బడ్జెట్ కేటాయింపులు

కవిటి: లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాల ఆశలపై నీళ్లుచల్లేలా ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్ ఉద్యోగవర్గాలకు ఎంతమాత్రం ఊరటనిచ్చేదిగా లేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లండ బాబూరావు, మురళీప్రకాష్ అన్నారు. మంగళవారం కవిటి మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ప్రచారంలో భాగంగా మీడియాతో మాట్లాడారు. పీఆర్సీ అమలుచేసే వరకు న్యాయబద్ధంగా చెల్లించాల్సిన ఐఆర్ ప్రకటన విషయంలో జాప్యం దురదృష్టకరమన్నారు. విద్యారంగ సమస్యలపై నవంబర్ 24, 25 తేదీల్లో మందస మండలం హరిపురంలో జరగనున్న యూటీఎఫ్ జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జగదీష్, సీతంనాయుడు,సీ త్రినాధనాయుడు సందీప్ పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కాశీబుగ్గ: పలాస జీఆర్‌పీ స్టేషన్ పరిధిలోని నౌపడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. సమాచారం అందుకున్న పలాస జీఆర్‌పీ హెచ్‌సీ ఎం.సోమేశ్వరరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 9440627567 నంబరుకు సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

ప్రజా సమస్యలపై ధర్నా రేపు

పలాస: ప్రజా సమస్యలపై పలాస తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేయనున్నట్టు సీపీఎం కార్యదర్శి ఎన్.గణపతి తెలిపారు. ఈ మేరకు ప్రజాపోరు పోస్టర్లను ఆవిష్కరించారు.

వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సివిల్ జడ్జి, పలాస న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. పలాస కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు ఉన్నాతాధికారులతో జాతీయ లోక్ అదాలత్‌పై మంగళవారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు.

పతకాలతో మెరిసిన కాశీబుగ్గ విద్యార్థులు




విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: అన్నమయ్య జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో కాశీబుగ్గ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో తొమ్మిదో తరగతికి చెందిన సహస్ర అండర్–14లో బంగారు పతకం సాధించింది. అలాగే ఏలూరులో జరిగిన స్టేట్‌మీట్‌లో టెన్త్ విద్యార్థి దీపక్ అండర్–19లో సిల్వర్ మెడల్ సాధించాడు. రాజమండ్రిలో జరిగిన పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న జశ్వంత్, తిరుపతిలు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం చిన్నంనాయుడు, పీఈటీలు కుసుమ, గణేష్, ఉపాధ్యాయులు అభినందించారు.


భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

కార్తీక ఏకాదశి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే విష్ణు, ఈశ్వర, వేంకటేశ్వర ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మంగళహారతులు, కుంకుమపూజలు, సామూహిక రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు చేశారు. పలుచోట్ల పెద్దసంఖ్యలో దంపతులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదాలను వితరణ చేశారు. ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


–సాక్షి నెట్‌వర్క్




సోంపేట: లక్కవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఏకాదశి మండపం




కాశీబుగ్గ: మందస మండలం పీతాతోళిలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు




టెక్కలి: భవానీనగర్‌లోని శివదుర్గాదేవి సమేత మరకత లింగేశ్వర ఆలయ ప్రాంగణంలో సామూహిక రుద్రాభిషేకాలు




నందిగాం: సుబ్బమ్మపేటలో లక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తజనం



పలాస: లక్ష్మీపురం శివాలయం వద్ద దీపారాధనలో మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి, భక్తులు



సంతబొమ్మాళి: నౌపడ విష్ణు ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



ఇచ్ఛాపురం: వెంకటేశ్వరాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు